


# ఒక వీడని కథ

శీను భవానికి కనిపించకుండా ఉండాలని ఎంతో ప్రయత్నించేవాడు. వాడికి భవానిని చూస్తే భయమా? కాదు. కావలిసినస్తే ఎన్నో సార్లు తానే ఆమెను చిన్నప్పటి నుంచీ అదుపు ఆజ్ఞలలో పెట్టడానికి ప్రయత్నిస్తూ వచ్చాడు. అవసరం అయితే తన్నేవాడు కూడా. ఈనాడు తను భవానిని తన్నలేడు. భవాని గట్టిగా మాట్లాడితే శీను సమాధానం చెప్పలేడు. భవాని శీనును మొదటి రోజులలో లాలించేది. తరువాత నిష్కర్షగా "ఈ పని నువ్వు చెయ్యరాదు" అని అనడానికి బదులు ఆ చెయ్యబోయే పనిని సమూలంగా విమర్శించేది. ఫలితం ఇలా ఉండాలి అనే నిర్ణయం మాత్రం కనిపించనిచ్చేది కాదు.

ఇంతకూ-శీనుకూ భవానికీ ఉన్న సంబంధం ఏమిటి? అది వాళ్లకే తెలియదు. కులం ఒకటి కాదు. అయినప్పుడు ఎలాంటి సంబంధం ఉండడానికి వీలవుతుంది? కాలేజీలో ఏర్పడ్డ సంబంధాన్ని లెక్చరర్లూ సహాధ్యాయులూ అపార్థం చేసుకోక పోలేదు.

అయినా భవాని తత్త్వాన్ని బట్టి వాళ్లనెవర్నీ లెఖ్ఖ చెయ్యలేదు. చేసిందేమో ఆమెకు తప్ప ఇతర్లకు తెలియదు. ఆమె ప్రవర్తనలో మాత్రం వాళ్ళగోలను గుర్తించిన చిహ్నాలేవీ కనుపించవు శీను ఇంటిదగ్గర చెప్పకుండా వచ్చి ట్యూషన్లు చెప్తూ తన కాలేజీ చదువు వెలిగించడానికి వచ్చాడన్న సంగతి భవానికి తన తండ్రి దగ్గరకు శీను వచ్చినప్పుడే తెలిసింది.

ఆరోజు ప్రొద్దున్నే భవాని లేచి ఆకాశం వంక ఆదోరకంగా చూస్తూ నిలబడింది. మేడ మెట్లమీదనుంచి తాను దిగుతూండగా-

"ఈ ఇంటి యజమానులు మీరేనా అండీ?"

"అవును. మీకేం కావాలి?"

"నేను కాలేజీ విద్యార్థిని..."

"ఇక్కడ గదులు ఖాళీగా లేవు."

"గదికోసం రాలేదు. మీ ఇంట్లో ఎవరయినా చిన్న పిల్లలుంటే ట్యూషను చెప్పిస్తారేమో నని వచ్చాను."

"ట్యూషన్లా? వాటికీ కాలేజీ చదువుకూ ఎలా కుదురుతుంది..."

అలా సంభాషణ జరిగింది. శీను తమ ఇంట్లో ప్రయివేట్లు చెప్పేవాడు. తన తండ్రి కొంత డబ్బు ఇచ్చేవాడు. ఆయనకు తెలియకుండా తన చేతికి అందినంత డబ్బు తానూ శీనుకు ముట్ట చెప్పేది.

అలాంటి సంబంధం - భవానినికూడా శీను దగ్గర చదువుకోమని వాళ్ళనాన్న అనడంతో- మరీ దగ్గర అయింది.

ఆ సంబంధాన్ని శీను చనువుగా వాడుకోలేదు. భవాని చనువుగా కాకపోయినా ఆప్యాయంతో వాడుకొన్నది. కాలేజీ చదువు

వి. యస్. అవధాని

పూర్తయి శీను గృహస్థ జీవితం గడిపే దశలో కూడా భవాని అతని జీవితాన్ని ఆక్రమించింది.

విమల శీనుకు తగిన భార్య అయినా ఆమెకు వచ్చిన జబ్బుకు ఆమె కారణంకాదు. శీను విమలమీద ఎన్నడూ విసుక్కోలేదు. పైగా విమలతో జీవితం సాగించడం మొదలుపెట్టినాక శీను తన జీవితంలో కొంత నిశ్చలత నలవరచుకున్నాడు. కాని విమల శీనును ప్రేమించినంతగా శీను విమలమీద శ్రద్ధ చూపలేక పోయాడు.

భవాని శీనును ఈ కారణంగానే విమర్శించేది. అయితే శీను విమలను తగినంత జాగ్రత్తగా చూడకపోవడానికి కారణం ఏమిటి?

* * *

శీను త్వరగా ఎక్కడికో వెళ్లాలని ప్రయాణం అవుతున్నాడు. భవాని శీను కోసం వెదుక్కుంటూ అదే సమయానికి తారసిల్లింది.

"ఎక్కడికి ప్రయాణం అవుతున్నావ్?"— అంది భవాని.

"పనుంది. వెళ్లాలి. చాలా తొందరగా వెళ్లాలి."

"నీ హడావుడిని బట్టే నువ్వు త్వరగా వెళ్లాలని తెలుస్తోంది. ఎక్కడికని అడుగుతున్నాను."

"ఇవాళ రాత్రికి కార్యవర్గం మీటింగున్నది. త్వరగాపోయి నేను చేయాల్సిన పని చాలా ఉంది" అంటూ శీను బయటికి పోతూవున్నాడు.

"అలా దులపరించుకు పోవడానికి వీలులేదు, ఆగు."

"విసిగించకు భవానీ! తొందరగా చెప్పు. ఏమిటీ సంగతి."

"సంగతి! శీనూ నీ తొందరంతా దేనికి? ఏమి సాధించడానికిగాను ఇంత ఆవేశపడుతున్నావు?"

"ఆవేశం లేదు. ఆవేగం లేదు. నా ధర్మాన్ని నేను చేస్తున్నాను."

"ధర్మమా? పెంచి పెద్దవాణ్ణి చేసిన తల్లిదండ్రులను ధిక్కరించి నీవే సర్వస్వం అని నమ్ముకున్న విమలను ఏవగించుకుని నువ్వు సాధిస్తున్న ధర్మం ఏమిటి?"

"నేను విమలను ఏవగించుకోలేదు విమల నాతో పాటు కార్యక్రమానికి దిగలేకపోతే అదీ నా తప్పేనా! నన్ను పెంచి పెద్దవాణ్ణి చేశారంటున్నావు. నాకోసం చేశారా? వారి కోరికలనూ, శరీరావసరాలనూ తీర్చుకునేటందుకు."

"శీనూ, ఇదే ఆవేగం అంటే! ప్రతివాళ్ళకూ ఏదో లోపం అంట గట్టడం. నువ్వు ఒక్కడివే సరయిన దోవలో ఉన్నాననుకోవడం, రాబోయే కాలానికై జాగ్రత్త పడకపోవడం, ఇవే"

"భవానీ! నన్ను గురించి నీ యిష్టం వచ్చినట్లు అనుకో. నేను పోవాలి"

అంటూ శీను బయటికి వెళ్ళాడు. ఎందుకు వెళ్ళడు? అతడు కార్యశూరుడు. రణరంగ ధీరుడు. ఆఖరు పోరాటాని కాయత్తం అవుతున్న వీరుడు.

కార్యక్రమం ఆచరించడానికి తిండీ, నిద్రా లేకుండా తిరుగుతాడు. తనవంటి సోదరులకు లేకపోతే తన ఏవస్తువైనా ఇచ్చేస్తాడు. ఇదంతా అతడు నేర్చుకున్న రాజకీయ విజ్ఞత.

బి. ఏ. దాకా చదువుకున్న తనచదువు ప్రపంచం పడే ప్రసవ వేదనను పోరాటం చేతనే పరిష్కరించమని అంటోంది. అంతర్జాతీయ కార్మిక లోకబాధలు అతన్ని కలవర పరుస్తున్నాయి. ఆ కలవరంలో తన సంగతి, తన భార్యసంగతి, తన కుటుంబ పరిస్థితుల సంగతీ అన్నీ మరచిపోతున్నాడు. ఎందుకు మరచిపోడు!

భవాని శీను జీవితాన్ని ఒక భక్తురాలిగా చూసేది. ఆ దశలో శీను దేన్నో సాధించేటందుకు తహతహ పడుతున్నాడనీ, ఆ సాధన అయిన తరవాత మామూలు గృహస్థుగా మార్తాడనీ-అనుకునేది.

కొన్ని సంవత్సరాలు గడిచినాక శీనుకు తను చేసే పనిసంగతి తెలియదనీ, అతనికి తెలియ చెప్పాల్సిన బాధ్యత తనకున్నదనీ భవాని అనుకునేది.కాని ప్రయోజనం లేకపోయింది.

ఎన్నోరోజులు శీను ఇంటికే వచ్చేవాడు కాడు. ఆరోజుల్లో విమల పడేబాధలు భవాని చూడలేకపోయేది. ఉన్న కొంచెం ఆస్థి శీను పార్టీ సోదరులను మేపడానికి, ఇంకా అటువంటి పనులక్రింద, ధ్వంసమయింది. శీను ఇంటికి వచ్చినప్పుడల్లా కొంచెం డబ్బు తెచ్చి ఇంటికి కాస్త సుఖం రుచి చూపించేవాడు.

వాడు ఇంటికి రాని రోజులలో విమల పస్తులుండేది. ఆరోజులలో భవాని విమలను ఆదరించి

తన చేతనయిన సాయం చేసేది. మొదట్లో ఆమె సహాయాన్ని విమల అనుమానించేది. తరువాత తరువాత పరిస్థితుల వత్తిడిచేతా, భవాని చూపే నిర్మలత్వం వలనా, ఆదరణ వలనా, ఆమె సహాయాన్ని తిరస్కరించలేక పోయింది.

విమల సామాన్య సంస్కారంగల స్త్రీ. అయినా శీనునూ అతని వైఖరినీ ఒక రకమైన నిర్లిప్తతతో చూచేది. తన భర్త పనులను మొదట్లో అసహ్యించుకున్నా తరువాత "ఆయన నైజం అలాంటిది. నాఖర్మ ఇలా ఉంది" అని అనుకుని తృప్తిపడేది. కాని ఎంత సరిపెట్టుకుందామని ప్రయత్నించినా ఆమెలో దిగులు ఎక్కువయి ఉన్న ఆరోగ్యాన్ని (కొంచెం ఆరోగ్యాన్నికూడా) పాడుచేసింది. అంతటితో విమల పూర్తిగా మంచాన పడ్డది. అయినా శీను తన కార్యక్రమం మానలేదు. మానడు!


భవాని ఇందుకే కలవరపడ్డది. ఎప్పుడూ విమలదగ్గరఉండి ఉపచారం చేస్తూంటే తన భర్తకు కష్టంగా ఉన్నది. "అదరిద్రుడితో ఎందుకమ్మా నీకింత సంబంధం" అని తన తండ్రి విసుక్కున్నాడు. కాని భవానికిమటుకు ఈ రాజకీయాల పిచ్చివాణ్ని వదల బుద్ధిరావడం లేదు. వాడి సంగతి ఎట్లాఉన్నా తనవంటి విమల ఆ విధంగా బాధపడుతుంటే, అష్టకష్టాల పాలవుతుంటే చూస్తూ ఊరుకోలేక పోతున్నది.

* * *

అర్ధరాత్రి. ప్రపంచం అంతటినీ శాంతి దేవత పరిపాలిస్తోంది.కాని భవాని హృదయంలోమాత్ర శాంతి లేదు.

విమల పరిస్థితి కొన్ని నిముషాలలో ఎలా ఉంటుందో చెప్ప వీలులేదని డాక్టరన్నాడు. ఇప్పటికి ఇరవై రోజులనుంచీ శీను అంతులేదు.

ఎవరిని ఉద్ధరించడానికో ఈ రాజకీయాలు. స్వంత ఇల్లును సరిచేసుకోలేనివారు రాజకీయాలను నడిపిస్తున్నారా? ఒక్క శీను సంగతే ఇలా ఉందా, లేక రాజకీయ రంగంలో విహరించే నాయకులందరూ ఇలానే ఉన్నారా? ఒక చెంప విమల ప్రాణం కొన్ని నిముషాలలో ఉన్నది. మరో చెంప తండ్రి విసుక్కుంటున్నాడు. భర్త ఖస్సుబుస్సు లాడుతున్నాడు. శీను అంతులేదు.



పోనీ-శీను తల్లిదండ్రులు ఎందుకు జోక్యం కల్పించుకోరూ? వాళ్ళను మూర్ఖులనీ మానవత్వంలేని వాళ్లనీ అంటూంటే ఎలా జోక్యం కల్పించుకుంటారూ? ఇక విమల తల్లిదండ్రులు. వాళ్లు తమకు చేతనయిన సాయం చేస్తూనే ఉన్నారు. కాని విమల తన ఈ జబ్బు సంగతి వాళ్ళకు తెలియనివ్వ లేదు. వాళ్లకు తెలియచేయడానికి వాళ్ళు ఎక్కడున్నారో భవానికి తెలియదు. అయోమయంగా, దిగులుగా, భవాని విమల మంచం దగ్గర పచారు చేస్తోంది.

దబదబా శీను ఇంట్లోకి ప్రవేశించాడు.

"శీనూ..."

"భవానీ..."

"ఇటు చూడు...ఇదీ నీ పార్టీ సేవ. ఇదీ నువ్వు సాధిస్తున్న వర్గాలు లేని స్వర్గధామం. విమల కొన్ని నిముషాలలో మనల్ని వీడిపోతుంది. ఈ ఆఖరు నిమిషాలలోనన్నా విమల ప్రక్కన నిలబడి ఆమె ఆత్మకు శాంతి..."

"భవానీ" అన్నాడు శీను కఠోరంగా.

"ఏం శీనూ... ఎందుకూ అంత కోపం? తిండికి మొహంవాచీ, సహవాసానికి మొహం వాచీ విమల ఇలా అయిపోయింది. నిన్ను కట్టుకుని విమల తన జీవితాన్ని వ్యర్థం చేసుకున్నది. తోటి జీవిని కనికార దృష్టితోనే చూడలేని నీ రాజకీయ విజ్ఞత ఏమిటి శీనూ...ఇటు రా." అంటూ బలవంతంగా వాణ్ణి విమల మంచం దగ్గరకు లాక్కొని పోయింది.

"విమలా ... విమలా ... శీను వచ్చాడు." అన్నది భవాని మెల్లిగా.

"వచ్చారా...సెలవు..." అంటూనే విమల కళ్ళు మూసింది.

* * *

ఈనాడు శీను అన్నివిధాలా స్వతంత్రుడు. పార్టీసేవ చేయడానికి ఎటువంటి ఆటంకాలూ లేవు. కాని దానితోపాటు కొన్ని ఇబ్బందులు కూడా వచ్చినయి.

ఎప్పుడో తీరిక చేసుకుని ఇంటికి వెళ్ళినప్పుడయినా "వచ్చారా! అబ్బ, ఇంత కష్టపడి పని చేస్తే ఆరోగ్యం చెడిపోదూ!" అని ఆదరించి సేవచేసేవాళ్లు లేరు.

భవానికూడా వాడిపట్ల మౌనంగానూ, ముభావంగానూ ఉంటోంది.

అంతే కాదు. పార్టీ విజయాన్ని సాధించింది. అధికారంలోకి వచ్చింది. తనకన్న తక్కువ చదువుకున్నవాళ్లు, తనకన్న తక్కువ త్యాగాలు చేసినవారూ శాసనసభ్యులూ, మంత్రులూ, ఇంకా ఇతర అధికార్లూ ఐనారు. తన పరిస్థితిలో మాత్రం మార్పు లేదు. ఎంతగా సరిపెట్టుకుందామని ప్రయత్నించినా డబ్బుని ఇబ్బంది శీనును బాధిస్తోంది. పైగా తన ఈ రాజకీయ జీవితం పాత స్నేహితులందరినీ విరోధులుగానో లేక నిరసించే వారుగనో చేసింది.

పోనీ ఏదన్నా ఉద్యోగం చేసుకు బతుకుదామంటే తన అలవాట్లు ఒకచోట కూర్చుని పని చేసేటందుకు తగినవి కావు. మొదట్నుంచీ సుఖపడ్డవాడు కాకపోయినా కొన్ని రకాల ఇబ్బందులకు అలవాటు పడ్డవాడు కాదు. మళ్లీ తను ఎక్కడ బయల్దేరాడో, అక్కడికే వచ్చాడు. మళ్ళీ ప్రయివేట్లు చెప్పడం మొదలు పెట్టాడు. కాని తను చదువుకునే రోజులలో ఉన్న ఆరోగ్యమూ లేదు. ఉత్సాహమూ లేదు. ఎంత ప్రయత్నించినా విద్యార్థులకు తను తృప్తికరంగా పాఠం చెప్పలేక పోతున్నాడు. పైగా ఆరోగ్యం కూడా చెడి దగ్గు, ఆయాసం ప్రారంభించినయి. ఎన్నో ఘనకార్యాలు సాధిద్దామనుకున్న శీను తన జీవితం ఇంత వ్యర్థం అయిపోవడం చూసి దిగ్భ్రమ చెందాడు.

తన పార్టీ సోదరులు అప్పుడప్పుడు కనిపిస్తే "పాపం ఇలా అయిపోయినా వేంరా!" అనే వారేకాని ఏ రకమైన సహాయమూ చేసేవారు కన్పించడం లేదు తను చేసిన కృషిలో ఎటువంటి లోపమూ చూపలేదు. తను నమ్మిన సిద్ధాంతాలను ఆచరణలో పెట్టడానికి ఎన్నో త్యాగాలు చేశాడు. అయినా తన పని ఆఖరుకు ఎందుకూ కొరకానివాడుగా తయారయింది.

ఒకరోజు రోడ్డువెంబడి నడుస్తూనే పడిపోయాడు. అదోవనే కారులోపోతూన్న భవాని వాణ్ని చూసి అసహ్యించుకుంటూనే కనికరించి కారులో తన ఇంటికి చేరవేసింది.

ఆ పడిపోవడం ఎన్నో రోజులకిగాని శీను ఈ ప్రపంచంలోకి రాలేదు. అంతకాలమూ

భవాని భర్తచేత ఈసడింపులు పడుతూనే వాడికి ఉపచారాలు చేయించింది.

ఒక అర్ధరాత్రి సమయాన శీనుకు ఒళ్లుపూర్తిగా తెలిసి తను ఒక పరుపు మంచంమీద ఉండడం చూసి ఆశ్చర్యపోయి లేచి నిలబడ్డాడు. ప్రక్క గదిలోంచి అప్పుడే ఎందుకో బయటికి వస్తున్న భవాని వాణ్ని చూసింది.

"భవానీ..."

"శీనూ..."

"నన్ను ఇక్కడికి ఎందుకు తీసుకువచ్చావ్?"

"నిన్ను శిక్షించడానికి శీనూ! నీమీద కనికరించికాదు. ఏదో ఘనకార్యం సాధిద్దామనుకొని నీకు నువ్వే పనికి రాకుండా పోయినావు. అటు తల్లిదండ్రులకూ, ఇటు నిన్నే సర్వస్వంగా నమ్మిన విమలకూ ఏ రకంగానూ ఉపయోగపడలేదు. పైగా ఇంతవరకూ నీలో ఎటువంటి మార్పూ లేదు. నీధర్మాన్ని నువ్వనుకోకుండానే ఆకాశానికి నిచ్చెనగా వేద్దామని ప్రయత్నించావు. ఇటువంటి నిన్ను దయదల్చి ఇక్కడికి తీసుకు రావడంచేత ఎటువంటి రాజకీయాశ్రిప్రాయాలూ లేకుండానే సామాన్య సంస్కారంతో, నీకన్న హృదయం గలదాన్నని రుజువు చేస్తున్నాను."

"భవానీ! నాకు అధికారం రాకపోవచ్చు. నేను సుఖపడకపోవచ్చు. కాని నాసిద్ధాంతాలు గలవారు ఈనాడు ఎంత గొప్ప పదవులలో ఉన్నారో చూడు."

"అదే పొరపాటు శీనూ! నేనుకూడా నీ సిద్ధాంతాలు తప్పని అనడంలేదు. ఆమాట నువ్వే అంటున్నావు. నిన్ను ఉద్ధరించలేని తాత్వికతను చేపట్టి ఇలాంటి అధమస్థితిలోకి పతనమయ్యావని నువ్వు అంగీకరించలేవు. అలా అంగీకరించినపుడు నువ్వూ మామూలు మనిషివే అవుతావు. నీకు మా అందరికంటే గొప్పవాణ్ణి కావాలని ఉన్నది. ఆ కోరిక నీజ్ఞానాంతస్థులలో లేదు. అలాంటి కోరిక ఉన్నదని నీకు తెలియక పోవచ్చు. కాని నిజం మాత్రం అంతే. వాళ్లెవరో గొప్పవారయూ రంటున్నావు. వాళ్లు నీసిద్ధాంతాన్ని ఆచరణలో పెట్టడంచేతనే గొప్పవాళ్ళయ్యా రనడానికేం నిదర్శనలు లేవు. ఎన్నో ఇతర కారణాలచేత ఇవాళ వాళ్లు అధికారంలో ఉన్నారు. అదంతా అలా ఉంచు. ఇప్పుడు నిన్ను రక్షించేదేదీ లేదు. ఇంత చిన్న వయస్సులోనే ఏ రకపు సుఖమూ చవిచూడకుండానే ముసలివాడి వయావు."

"భవానీ!నన్ను ఇంకా బాధ పెడుతున్నావు."

"తప్పదు. బాధ అని నువ్వు అంటున్నావే అది ఈ హృదయంలో ఎంతో ఉన్నది. నీకు నిజమైన బాధ తెలియదు. తెలిసినపుడు నీలో నిజమైన మానవత్వమే ఉండేది. విమల అంత అధ్వాన్నపు చావు చచ్చేది కాదు. అందరిలాగానే నువ్వూ ఏదో వుద్యోగం చేసుకుని సుఖంగా వుండేవాడివి. చిన్నప్పట్నుంచీ ఒకరకపు సంప్రదాయంలో పెరిగి తరువాత ఏవో కొన్ని సిద్ధాంతాలను గ్రుడ్డిగా నమ్మి వాటిలోని మంచిచెడులను తర్కించుకోలేక ఇలా అయిపోయావు."

'భవానీ! నువ్వు నా శత్రువ్వు. నే వెళ్లిపోతున్నాను."

అంటూ అంత రాత్రివేళ లేచిపోయాడు.

భయంకర రాత్రి వేళనే ప్రళయమారుతం వీస్తుంది. ఆ మారుతం వెంబడే కుంభవర్షం ప్రారంభ మవుతుంది. అంత వానలోనూ శీను నడిచినడిచి ఈ లోకాన్నుంచి అంతర్హితుడయాడు.

ఆ సంగతి పరిచారకులు మరునాడు భవానికి చెప్పారు. భవాని వాడు వెళ్లిన ద్వారందగ్గర నుంచుని ఆలోచిస్తున్నది.

---

నవలా రచయిత : (భార్యతో) ఇదిగో, నా నవలలో పదిసంవత్సరాల క్రిందట స్త్రీలు ఏవిధమైన జాకెట్లు ధరించేవారో వర్ణించ బోతున్నాను. నువ్వుకొంచెం చెపుతావా ?

భార్య : (చిరాకుతో) ఎలాంటి జాకెట్లా? నే నిప్పుడు వాడుతున్న లాంటివే !